




## వేములపల్లి శ్రీధర్

# 'అ ఆ' లు నేర్పిన గురుదేవులకి అక్షరాంజలి

కృష్ణాజిల్లా జి.కొండూరులోని ఎస్.ఎస్.ఆర్.ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1963 - 64 లో నేను ఎస్.ఎస్.ఎల్.సి చుదువుతున్నాను. పంచెకట్టు, ఫుల్‌హాండ్స్ షర్ట్, పైన కండువా, కళ్ళజోడు, పట్టీల చెప్పులు వేసుకుని ఉపాధ్యాయ వృతికి భాష్యం చెప్పిన వ్యక్తి ఆ పాఠశాలకు ప్రధానోపాధ్యాయులుగా శ్రీ చలసాని వెంకటరత్నంగారు వచ్చారు. నాది ఉయ్యూరు దగ్గర తాడంకి. 10వ తరగతివరకు అక్కడే చదివాను. జి.కొండూరులో మాఅన్నయ్య హైస్కూలులో లైబ్రరీ అసిస్టెంటుగా ఉద్యోగం చేస్తుండటం వలన చదవటానికి అక్కడకి వెళ్ళవలసి వచ్చింది. ఆ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు ఎక్కువగా తూర్పు కృష్ణాకు చెందిన వారవడంవలన అందరు కలిసి మెలిసి ఉండేవారు. అప్పట్లో ఆ ప్రాంతంలో వరి పండేది కాదు. ఎక్కువగా జొన్నలు పండించి దంచి వండుకుని తినేవారు. బియ్యం కొన్ని షాపులలో మాత్రం దొరికేవి.

ఆ పాఠశాల వాగు ఒడ్డున ఉంది. ఆ వాగులో వరదకు పులి కొట్టుకు వచ్చిందట. అందువల్ల దానిని పులివాగు అని పిలిచేవారు. ఆ గ్రామంలో ఎక్కడ త్రవ్వినా ఉప్పు నీరే కాబట్టి ఆ వాగులో చలం (అంటే ఒక గుంటలాగా ఇసుక తీస్తే నీరు ఊరుతూ ఉంటుంది. పరిశుభ్రమైన నీరు వచ్చే వరకు నీటిని తీసేవారు) త్రవ్వి కడవలో వడపోసుకునేవాళ్ళం. మా క్లాసు మొత్తం 25మంది. వారిలో అబ్బాయిలు 22, అమ్మాయిలు ముగ్గురు. పాఠశాల అప్పట్లో మంచి క్రమశిక్షణతో నడిచేది. ఉపాధ్యాయులు అందరూ కలిసి అంకితభావంతో వృత్తిపై గౌరవం ఉంచి పనిచేసేవారు. అప్పట్లో మాకు ఇంగ్లీషుకు శ్రీ వెంకటరత్నం గారు వచ్చేవారు. ఆయన పాఠశాలకు వచ్చేటప్పుడు పుస్తకం హస్త భూషణం అన్నట్లుగా ఎప్పుడూ చేతిలో పుస్తకం తప్పనిసరిగా ఉండేది. తరగతి గదిలో పాఠ్యబోధన చేసేటప్పుడు ఒక్కోరోజు ఆంగ్ల పాఠ్యాంశంలోని పద్యం ఒక్క పిరియడుకు ఒక్క లైను కూడా పూర్తి అయ్యేదికాదు. దానిలోని అర్థాలు విపులంగా వివరించి చెప్పేవారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు అమ్మాయిలు. ఒక కొడుకు అశోక్ కుమార్ 10వ తరగతి చదివేవాడు. అందువల్ల ఉదయం, రాత్రి ఆయన దగ్గరకు చదువుకోవడానికి వెళ్ళేవాళ్ళం. మాకు తెలుగు మాష్టారు సుబ్బయ్యగారు ఉండేవాళ్ళు. ఆయన కంఠము, భాషా స్వచ్ఛత ఎంతో మధురంగా ఉండేది. ప్రధానోపాధ్యాయులు పాఠశాలలోగాని, గ్రామంలోకానీ ఎక్కడ కనిపించినా విద్యార్థులు, గ్రామస్థులు చాలా గౌరవించేవారు. గ్రామస్థులు కూడా ఉపాధ్యాయుల మీద గౌరవభావంతో కూరగాయలు పంపేవారు. ఎస్.ఎస్.ఎల్.సిలో ఆ గ్రామస్థులు 15 మంది వరకు ఉండేవారు. మా అందరిది ఒకే మాట ఒకే బాటగా ఉండేది.

ఒక రోజు తరగతి గదిలో ఒక విచిత్రం జరిగింది. ఒక విద్యార్థి పుస్తకం అట్టతీసి ప్రక్క విద్యార్థికి ఇచ్చాడు. అలా అలా చేతులు మారి 7వవాడిగా నా దగ్గరకు వచ్చింది. దానిని నేను మిఠాయి పొట్లంగా చుట్టి రీసెస్‌లో బయటకు వెళుతూ దానిని ఆడపిల్లల బల్లపై పెట్టాను. 10 నిమిషాల తర్వాత లోపల బెల్లు కొట్టినపుడు అందరం తరగతి గదిలోనికి వెళ్ళాము. దానిని విద్యార్థినులు తీసి ఉపాధ్యాయుల ప్రక్కన వేసారు. సోషల్ టీచర్ దాన్ని చూసి దానిపై ఉన్నపేరు చదివి ఆ విద్యార్థిని నిలబెట్టారు. ఎవ్వరూ నా పేరు మాత్రం చెప్పలేదు. ప్రధానోపాధ్యాయుడి వద్దకు రిపోర్టు వెళ్ళింది. మరుసటి రోజు అసెంబ్లీలో ప్రధానోపాధ్యాయుడు చాలా తీవ్రంగా హెచ్చరించారు.

ఎస్.పి.ఎల్.ని పిలిచి ఎంక్వయిరీ చేయమని చెప్పారు. గ్రామంలోనూ చర్చనీయాంశమైంది. ఒకవారం రోజుల తర్వాత ప్రధానోపాధ్యాయుడి వద్దకు వెళ్ళి ఆ పని నేనే చేసాను సరదాకి చేసాను ఇక ముందు అటువంటి పనులు చేయనని కళ్ళనీళ్ళ పర్యంతమై చెప్పాను. ఆయన దాన్ని ఎవ్వరికీ చెప్పక స్టాఫ్ మీటింగ్ పెట్టి ఇంతటితో ఈ విషయం వదిలేస్తున్నాము. ఇది విద్యార్థులు కొంటెతనానికి చేసింది కానీ కావాలని చేసింది కాదని సర్ది చెప్పడం జరిగింది.

ఆనాడు గురువు అనే గౌరవభావం ప్రతి విద్యార్థిలోనూ ఉండేది. మాకు రాత్రిళ్ళు పాఠశాలలో తరగతులు నిర్వహించేవారు. ట్యూషన్ లేని వారందరం వెళ్ళేవాళ్ళం. ప్రధానోపాధ్యాయులు రాత్రిపూట 10 గంటల వరకు ఉండి చదివించేవారు. ఉదయం లెక్కల మాష్టారు వచ్చి గణితం చెప్పేవారు. గణితానికి చెన్నారావుగారు వచ్చేవారు. ఆకాలంలో కాంపోజిట్, జనరల్ అని భాగాలుండేవి. ఆయన పబ్లిక్ పరీక్షలు దృష్టిలో పెట్టుకుని 16 మోడల్స్ చేయించేవారు. వాటిలో 12 లెక్కలు తప్పనిసరిగా వచ్చేవి.

మేము పాఠశాలకు వెళ్ళేదారిలో ఆ పాఠశాల కట్టించిన శాగం శివరామ రెడ్డిగారి ఇల్లు ఉండేది. పాఠశాలకు వెళ్ళు ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు తప్పనిసరిగా ఆయనకు నమస్కరించి వెళ్ళవలసి వచ్చేది. ఆయన ఎప్పుడైనా వరండాలో కూర్చున్నప్పుడు అలా నమస్కరించని ఉపాధ్యాయులను బదిలీ చేయించేవారు. ఆనాటి పలుకుబడి అలా ఉండేది. వర్షాకాలంలో బాగా వర్షం పడినప్పుడు పులివాగు చాలా ఉధృతంగా వచ్చేది. ఆ రోజు పాఠశాలకు సెలవు ప్రకటించేవారు.

ఆనాటి ఉపాధ్యాయులు వృత్తిపై గౌరవం అంకితభావంతో పనిచేసేవాళ్ళు. తక్కువ జీతం వచ్చినప్పటికీ దానితోనే పొదుపు చేసుకుని నాలుగురాళ్ళు వెనకేసుకునేవారు. ఈనాడు ఎంత జీతం వచ్చినా ఆనాటి విలువలు లేవు. విద్యార్థులను పైకి తీసుకురావాలి అనే భావన ఉండేది.

ఆ నాటి మా బ్యాచ్ విద్యార్థులం అందరం పబ్లిక్ పరీక్షలు రాయటానికి మైలవరం వెళ్ళి వ్రాయవలసి వచ్చేది. అప్పట్లో బస్సులు కూడా ఎక్కువ ఉండేవి కావు. అందువల్ల మైలవరంలోనే పరీక్షాకేంద్రానికి దగ్గరగా ఒక ఇల్లు అద్దెకు తీసుకుని మా పదిమందిని హాస్టల్లోలాగా ఉంచి ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో శ్రద్ధగా దగ్గరుండి చదివించి పరీక్షాకేంద్రానికి తీసుకెళ్ళి ఆయన మరల పాఠశాల నిర్వహణకు వచ్చేవాళ్ళు. అప్పటి మా తోటి విధ్యార్థులు ఉద్యోగస్తులుగా స్థిరపడినవారు ఎక్కువమంది. వారిలో (1). తాడికొండ జనార్ధనరావు ఉపాధ్యాయుడు, (2) తాడికొండ కృష్ణారావు సొసైటీ అధ్యక్షులు. 3 వెంకటేశ్వరరెడ్డి ఆర్.టీ.సి కండక్టరు (4) శాగం భాస్కరరెడ్డి ఆర్.టీ.సి కండక్టరు. (5) ఎన్.వి నారాయణరెడ్డి ఉపాధ్యాయుడు (6) ఎస్.వి కృష్ణారెడ్డి విలేజ్ అసిస్టెంటు (7) గరిమెళ్ళ రంగారావు వ్యాయామోపాధ్యాయులు (8) గుత్తికొండ రామచంద్రయ్య. ఉపాధ్యాయులు (9) నేను ఉపాధ్యాయుడుగాను ఇంకా అనేకమంది సహ విద్యార్థులు ఉద్యోగస్థులుగా స్థిరపడ్డారు. దీనికి కారణం ఆనాటి మా గురువుల ఆదర్శ బోధన మమ్ములను సన్మార్గంలో నడిపి మాకు ఒక చక్కని బాట వేసింది.




ప్రధానోపాధ్యాయులుగా పనిచేసిన శ్రీ చలసాని వెంకటరత్నంగారు మన ముందు లేకపోయినా ఆయన నేర్పిన బాట మాకు ఆదర్శమై మమ్ములని తీర్చి దిద్దిన గురువులకు ఋణపడి ఉంటాము. మేము సన్మార్గంలోకి వెళ్ళాలన్నా చెడు అలవాట్లకు లోనవ్వాలన్నా అదే వయసు కాబట్టి మమ్మలను సత్‌పౌరులుగా తీర్చిదిద్దిన మా గురువులు చిరస్మరణీయులు.

నా ఈ వ్యాసం చంద్రునికో నూలు పోగులాగా కీ.శే. చలసాని వెంకటరత్నంగారికి అంకితం